# పద్మవ్యూహం

రచన :
శ్రీమతి పరానేని శ్రీశైల భ్రమరాంబ.

ప్రశాంతమైన వాతావరణంలో కూర్చున్నా సత్యం మనస్సులో మాత్రం ప్రశాంతిలేదు. ఎటుచూచినా అశాంతి చెలరేగి పోతోంది. తన హృదయంలో-లోకమంతా నిశ్శబ్దంగా వున్నా తన మెదడు తనలో మెదిలే భావాలు. మెదడులోని ఆలోచనలు ఎప్పుడూ జాగృతిగానే వుంటాయ్. లోకమంతా విశ్రాంతి తీసుకున్నా తన మెదడు మాత్రం విశ్రాంతి తీసుకోదు. ఒకవేళ తన కళేబరం విశ్రాంతిగా పడుకున్నా తన మెదడులోని భావాలు, ఆలోచనలు కళ్ళేలు తెగిన గుఱ్ఱాల్లా విజృంభిస్తాయి. అదే తనకు తెలీని తెల్సుకోలేని చిదంబర రహస్యంగా వుంది. తను ఎవర్నీ తల్చుకు వుండకూడదనీ. ఎవరికోసం మనస్సు కలత పర్చుకోకూడదనీ ఎన్నోసార్లు తీర్మానించుకున్నాడు. కాని అది తన బలహీనతతో, స్వతహాగా తనలోవుండే దయార్ద్ర హృదయమో తనకే అర్థంకాదు. ఏమిటో! మానవ హృదయానికి అందరాని అతీతమైన ఆలోచనలు.

ఈ ప్రపంచంలో తనూ ఒక వ్యక్తి. తన లోనూ ఆశలు ఆశయాలు ఎన్నో వున్నాయి. ఒక్కొకప్పుడు ఈ మనుష్యుల హడావిడి చూస్తూంటే తనకేదో విచిత్రంగా వుంటుంది. ఒక్క క్షణం తమ నడకలో ఆలస్యమైతే అవతల ఏదో కొంపలంటుకొన్నంత ఆదుర్దా ప్రతివారిలోనూ గోచరిస్తుంది. లోకం ఎప్పుడూ ఇల్లాగే పరుగులెడ్తూవుంటుందా? కీ ఇచ్చిన గడియారంలా అలసట లేకుండా పరిభ్రమిస్తుంటుందా? ఇంత ఆరాటంతోనూ మానవుడు ముందుకుపోయి సాధించే దేమిటి? తృప్తి, సుఖం, శాంతి, ఆనందంకూడా ఎవ్వరి ముఖాల్లోనూ కన్పించవు. అటువంటప్పుడు ఈ ఆరాటమెందుకో? అసమర్థుడి జీవయాత్రలా కాలం జీవిస్తోంది, కాలానికి కట్టుబడి ఇరుసునంటిపెట్టుకుని బండి రెక్కల్లో తిరుగుతున్నారు మానవులు. ఎవరో ఒకరు అడిగితే రెండోవారు ఆగరు; ఒకరు జీవిత ప్రణయం చాలిస్తే వానికి సానుభూతిగా ఒక్క గంటకూడా ఆగడు రెండో మానవుడు. అయినా ఒకరితో ఒకరికి సంబంధ బాంధవ్యం తప్పదు. దేనికో యీ జీవితాలన్నీ ఒకరితో ఒకరు ముడిపెట్టుకుని చుట్టూ తిరుగుతారు. సత్యం మనస్సంతా ఇల్లాంటి ఆలోచనలు గజిబిజిగా అల్లుకుపోయి సుళ్లు తిరుగుతూంటే 'నాన్నా! యిప్పుడే రేడియోలో అక్కయ్యగారి నాటిక వుంది. రేడియో పెట్టు' అంటూన్న కామేశ్వరి పిలుపుతో సత్యం బాహ్యంలోకి వచ్చాడు-

'రేడియో పెట్టారు. సరిగ్గా నాటిక ప్రారంభించబోతున్నారు. పద్మవ్యూహం నాటిక. రచన భువనేశ్వరిదేవి. బ్యాగ్రౌండ్ గీతంతో ప్రారంభం.

మానవేయుడవు నీ వయ్యా. మాననీయుడవు నీవయ్యా.
సోదరీ భావం వహించినావా? అపనిందనలనే
వహించినావా?
చదవూ సంపదా సంఘ గౌరవమూ. జగతిని ముఖ్యం
కాదోయీ!
సాటి వారలకు సాయపడటయే ఉన్నత
మోయీ!......మా!
లోకమంతయూ ఎదురు తిరిగినా చెదరం బెదరక
నిలచావా?
నడుము కట్ట నీ సోదరి రక్షణకై అతి ధీరుడ
వయ్యావా? 'మా?
సోదరి భావం వహించినావా? అపనిందనలనే
సహించినావా
విడువక కదలక నిలిచావా? అంతిమ విజయం నీవే
నోయ్ 'మా'

అంటూ రేడియోలో పాట ప్రారంభమైంది. తన కూతురు కామేశ్వరి పిల్లలు, తన భార్య ఎంతో శ్రద్ధగా నాటిక వింటున్నారు. కానీ తను మాత్రం వినలేకపోతున్నాడు. తన కళేబరం రేడియోకి దగ్గరలో యున్నా. కాని రేడియో నుంచి వచ్చే ధ్వని తన చెవుల్లోకి జొరపడలేక పోతోంది. తన మనస్సు కంట్రోల్ తప్పి భువనేశ్వరి వైపుకి పరుగెత్తుతోంది.

అక్కడనుంచి లేచిపోదామనుకున్నాడు. పోతే మాత్రం ఏం లాభం? తను భువనేశ్వరిని మర్చిపోగలడా?

ఒక్కసారిగా భువనేశ్వరికి తనకీమధ్యగల పరిచయం గుర్తుకు వస్తోంది.

సత్యంకు మందుల షాపులో హెడ్ గుమాస్తాగా ఉద్యోగమైంది. ఇంటికోసం వచ్చినప్పుడు భువనేశ్వ

రిని చూచాడు ఆమెను చూడగానే సత్యంకు ఒక పుత్రికా వాత్సల్యం కల్గింది. భువనేశ్వరికి కూడా ఆయనను చూస్తే తన తండ్రి గుర్తొచ్చాడు. ఇంచుమించు తన తండ్రిలోని పోలికలన్నీ అచ్చుగుద్దినట్లు సత్యంలో చూచింది. 'బాబ్బాయీ!' అంటూ పిలిచింది భువనేశ్వరి. 'అమ్మాయి!' అన్నాడు సత్యం. ఆ పిలుపుతో తండ్రీ కూతుళ్ళ కంటే కూడా సన్నిహితులయ్యారు-

సత్యం కుటుంబంతో సహా భువనేశ్వరి యింటి కాపురం వచ్చాడు. సత్యం భార్యకూడా భువనేశ్వరిని కూడా కన్నబిడ్డలా భావించేది. సత్యం కుటుంబంలో ఆతనికో పెద్ద కూతురైంది భువనేశ్వరి.

ఒక రోజున పోస్టులో బుక్సు వస్తే సత్యం చూచి 'అమ్మాయీ! నువ్వు వార పత్రికలు. మాసపత్రికలు వగైరాలన్నీ తెప్పిస్తూంటావా?' అన్నాడు.

'ఇదుగో ఇప్పుడే వచ్చాయి యీ నవల చదవండి' అని చేతికిచ్చి లోపలికి వెళ్ళిపోయింది.

ఆ నవల తీసుకుని సత్యం ఇంట్లోకి వచ్చాడు. తను ఎప్పుడూ పత్రికలు నవలలు చదవకపోయినా ఈ నాడు తన అభిమాన పుత్రిక స్వయంగా వ్రాసిన నవల చూచే సరికి చదివేవరకూ మనస్సు వేగిర పడింది. నవల పూర్తిగా చదివాడు. కథా రచయిత హృదయానికి హత్తుకునేటట్లుంది. చదువుతూన్నంతసేపూ కథలోని పాత్రలు సజీవ మానవ రూపాలతో సాక్షాత్కరించినట్లుగా కన్పించాయి. ఆ కథలో సన్నివేశాలు. సంఘటలన్నీ ఎంతో అనుభవ పూర్వకంగా వ్రాసినట్లే ఉన్నాయికాని, అందులో తీసివెయ్యాల్సిందికాని, తప్పుపట్టడానికిగాని ఒక్క అక్షరం కూడా కన్పించలేదు.

'అమ్మాయీ! నీ రచనలు యింకా వున్నాయామ్మా!' అంటూ అడిగాడు కుతూహలంగా సత్యం. ఒక బీరువా పుస్తకాలన్నీ తెచ్చి సత్యం ముందు పెట్టింది. భువనేశ్వరి. సత్యం సాదారణంగా ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడు. భువనేశ్వరికూడా రాజపుత్ర స్త్రీలా అసలు తలుపు తీసి బయటకేరాదు. సాటి ఆడవాళ్లతో కూడా అతి ముక్తసరిగా మాట్లాడే స్వభావం భువనేశ్వరిది. అటువంటి భువనేశ్వరీ సత్యం ఏ సుముహూర్తంలో చూచుకున్నారో కాని ఆమెకు అతని దగ్గర కన్నబిడ్డ కంటే ఎక్కువ చనువు సంపాదించింది.

సత్యంకు భువనేశ్వరి చుట్టంకాదు. కనీసం ఒక స్నేహితుని కూతురైనా కాదు; ఆ యింట్లోకి దానికితం ఆమెను ఎన్నడూ తను చూళ్ళేదు. అయినా ఆమెయందు తనకి ఈ ఆరునెలలనుంచీ అవ్యాజమైన అభిమానం పెరుగుతోంది. అందుకు కారణం ఆమెలోని సత్ప్రవర్తనా, వినయ విధేయతాభావం దయా స్వభావం వల్లా ఆమెయందు తనకొక ప్రత్యేక ఆత్మీయత ఏర్పడిపోయింది.

'అమ్మాయీ! నీ రచనలతో ఇంకా దేశంలో ఉండే ప్రతీ పత్రికలూ నింపి ఇంకా కీర్తిని సంపాదించాలని నే నాశిస్తున్నానమ్మా?' అన్నాడు సత్యం.

'నాకు యింటిపనితోనే చాలా టైమ్ అవుతుందండీ. మిగతా కొద్దికాలం మాత్రం వ్రాయడానికి వుంటుంది. సాఫ్ వ్రాసేవాళ్లు వుంటే ఇంతకురెట్టింపు వ్రాద్దును' అంది మామూలు ధోరణిగా—

'అమ్మాయీ! నీ శ్రేయస్సు కోరుతూ, అనుదినము నీ సుఖాన్ని కాంక్షించే ఈ బాబాయికూడా నీకు కొంత సహాయపడగలడమ్మా. నువ్వు చిత్తు వ్రాస్తే అది నేను సాఫ్‌కాపీ వ్రాసియిస్తూంటాను. అందువల్ల హెచ్చుకథలు వ్రాసే అవకాశంవుంటుంది. అన్నాడు ఉత్సాహంగా సత్యం.

బాబాయి, మీకు టైమ్ ఉండొద్దూ? శ్రమ ఎక్కువగా పొందాల్సి వుంటుందేమో!' అంది సంకోచంగా భువన్వేరి.

'బిడ్డల అభివృద్ధికి తండ్రి ఎంతశ్రమనైనా వహించగలడమ్మా? నువ్వొక ప్రఖ్యాత రచయిత్రివై అఖండ కీర్తి పొందితే విని ఆనందిస్తా - నీ రచనలద్వారా వచ్చిన ధనంతో నువ్వు ఐశ్వర్యవంతురాలవైతే కళ్లారా చూచి మురిసిపోతా. బిడ్డలు ఉన్నతికి వస్తూంటే తండ్రికి పరమానందంకాదా?'

భువనేశ్వరీదేవి కథలన్నీ సక్రమమైనపద్ధతిలో నడచి కథనంలో నైపుణ్యం కల్గి, సున్నితమైన పదజాలంతో ఊహలకి మెరుగులు దిద్ది ఏయే భావాలకి ఎట్టి ప్రాముఖ్యత నివ్వాలో - వాస్తవికతను ధ్వనింపచెయ్యడానికి ఏ శైలిని ఏ విషయాల్లో వినియోగించాలో-చుట్టూ ఆవహించిన తన పరిసరప్రాంతాల్లోని వ్యక్తుల్నీ వ్యక్తిత్వాన్ని కబళిస్తున్న పరిస్థితుల్నీ, మానవస్వభావపు మూర్ఖత్వాన్ని అన్నికోణాల్లోంచి పరిశీలించి-కొందరు చెడపురుగుల్లాంటి వ్యక్తుల మూలంగా అమూల్య జీవితాలు ఎల్లా నాశనమై

పోతున్నాయో-తన విజ్ఞాన ప్రభతో విమర్శిస్తూ ఉత్తమ రచయిత్రిగా బిరుదు పొందింది భువనేశ్వరి.

సత్యం సహాయంతో భువనేశ్వరీదేవి రచయిత్రిగా మహోన్నత స్థాయి నాక్రమించుకుంది. స్వప్నాల్లో కూడా ఊహించలేని సత్కారాలు పొందింది. వేలు పెట్టిన ప్రతీ పనీ విజయవంతమై ఆమె ప్రతిష్ట వేయింతలుగా వర్ధిల్లింది. పలుకుబడి సంపాదనకూడా కల్గింది ఆమెకి. తన ఈ అభివృద్ధికి చాలావరకూ కారణం ఈ సంవత్సరకాలంనుంచీ తన బాబాయేనని ఆమెకు మనస్సులోనేకాకుండా ఆయన పాదాలకు నమస్కరించి ఆశీస్సులు పొందేది. తనబిడ్డ ఇంకా గొప్పది కావాలని కాంక్షించే వాడేకాని సత్యం పవిత్ర హృదయంలో అసూయగాని, స్వార్థం కాని ఏ కోశాన్నా లేవు.

కాని పరిస్థితులు వక్రించాయి. సత్యంలోని పితృప్రేమనీ, నిస్వార్థాన్ని, నిర్మల హృదయాన్ని లోకం అపార్థం చేసుకుంది. భువనేశ్వరిలోని సద్గుణాలకి లోకం మసి పూసింది. భువనేశ్వరికంటే సత్యం ఇరవై ఏళ్ళు పెదవాడైనా, వారిద్దరిలోని పవిత్ర బాంధవ్యాన్ని చెడుగా భావించారు లోకులు. ఆమె అతనితో ఎందుకింత చనువుగా వుంటుంది? అతడు ఆమెకి దీక్ష వహించి ఎందుకు వ్రాసియిస్తున్నాడు? దీనికంతకీ మూలకారణం వారిద్దరిలోనూ శారీరక సంబంధం వుందన్నారు. ఇరుగు పొరుగులే వదంతులు లేవదీశారు. ఉన్నవీ లేనివీ వారి నెత్తిన రుద్దారు. చుట్టూ పద్మవ్యూహం పన్నారు. చుట్టుపట్లవారంతా ఆమె అభివృద్ధిని సహించలేక అసూయతో అల్లాడిపోయి ఈర్ష్యతో కుతకుతలాడి చివరకీవిధంగా ఆమెపై అక్కసు తీర్చుకున్నారు. భువనేశ్వరికి జీవనాధారుడైన భర్తతో ఎన్నో కల్పించి చెప్పి ఆమెపై అసహ్యం కల్గించారు. భార్యా భర్తల మధ్య అగ్నిపర్వతం బ్రద్దలైంది. తన ఇంట్లో కాపురముండి కాలకూట విషసర్పమై తననే కాటువేసి తన భార్యను లోబర్చుకున్నాడని సత్యాన్ని దూషించాడు. సత్యం ఎన్నోవిధాల సత్యాన్ని నిరూపించాలని ప్రయత్నించాడు. కాని అనుమానంతో దహించుకుపోయే అతనికి సత్యం మాటలు చెవికెక్కలేదు. భువనేశ్వరిని ఇంటినుంచి పొమ్మన్నాడు. వారంరోజులు హోరాహోరీని భువనేశ్వరికీ భర్తకీ మధ్య సంఘర్షణ రేగింది. చివరకి భర్తే జయించాడు. భువనేశ్వరి అందరి అపవాదుల పద్మవ్యూహంనుంచీ బయటకు రాలేకపోయింది. ఆరాత్రే తన పరిస్థితినంతా 'పద్మవ్యూహం' అనే నాటిక వ్రాసి సత్యానికిచ్చింది. అదే ఆమె చిట్టచివరి రచన. ఇది రేడియోలో ప్రచారం చెయ్యబడాలని ఆమె కోరింది కడసారిగా కన్నీటితో నమస్కరించింది బాబాయికి.

మర్నాడు ప్రొద్దున్నే భువనేశ్వరి శవం చూచిన వారంతా 'పుచ్చిచచ్చినా పుణ్యస్త్రీ చావురాదు. చాలా అదృష్టవంతురాలు' అన్నారు. నాల్గురోజుల జ్వరంతో అనాయాస మరణంపొందిన ఉత్తమురాలు అన్నారు.

కాని సత్యం హృదయానికిమాత్రం ఆమె ఎల్లా చనిపోయిందో స్పష్టంగా తెల్సు నరరూప రాక్షసులవంటి అమ్మలక్కల అపవాదులతో, వారు పన్నే కుట్రలవల్ల ఆ పద్మవ్యూహంనుంచి బయటపడలేక బలిఅయిన భువనేశ్వరికోసం సత్యం కన్నీరు కార్చనిరోజు నేటివరకూ లేదనవచ్చు.

రేడియో నాటిక పూర్తికావడంతో సత్యం మళ్ళీ బాహ్యంలోకి వచ్చాడు

